

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**అన్నయ్య పెద్దగా** నవ్వడంతో ఉలిక్కిపడి నిద్రలేచాను. ఎక్కడ ఉన్నానో ఓ రెండు క్షణాల వరకు తోచలేదు. పళ్ళు తోముకుని అన్నయ్యకి గుడ్ మార్నింగ్ చెప్పాను.

"ఇప్పుడే లేచింది.. ఆఁసరే.. చెప్తాను. బాయ్" ఫోన్ పెట్టి నావైపు విచిత్రంగా చూశాడు.

"సారీ అన్నయ్య, చాలా లేట్‌గా లేచాను" అడక్కుండానే సంజాయిషీ ఇచ్చాను.

"పర్లేదు. ఇవాళ సండే కదా. నువ్వు ఇంకాసేపు పడుకుంటావనుకున్నాను."

"మెలుకువ వచ్చేసింది. ఫోన్‌లో ఎవరికి నేను లేచానని చెప్పావు?"

"అమ్మకి. తన ఫోన్‌లో ఛార్జ్ అయిపోవచ్చిందట. రాత్రి మళ్ళీ చేస్తానంది."

"ఓ. ఏం చెప్పింది కబుర్లు?" కుతూహలంగా అడిగాను.

"నిన్ను బాగా మిస్ అవుతున్నారట. అమ్మ లంచ్‌కి టేబుల్ మీద యాధావిధిగా మూడు ప్లేట్లు పెట్టిందట. నువ్వు అక్కడలేవని గుర్తురాగానే ఏడ్చిందట. నేను ఇక్కడికి వచ్చాక అసలు ఎవరైనా పట్టిచ్చుకున్నారా?" వెటకారంగా అడిగాడు. కానీ నా కళ్ళల్లో నీరు గమనించి "నువ్వు పడమటి సంధ్యారాగంలో ఆదినారాయణలాగా బానే ఇబ్బంది పడుతూ వచ్చావని కూడా చెప్పింది" అన్నాడు.

కళ్ళు విప్పారించి "ఔనా?" నామోషీ పడుతు అడిగాను.

"ఆ డాలస్ ఆవిడకి రోజూ ఫోన్ చేసి మాట్లాడమందట? స్వీట్స్ కూడా పంపమందట?"

"ఔను. మర్చిపోయాను సారీ" బుంగమూతి పెట్టాను.

అన్నయ్య పెద్దగా నవ్వి "మంచి పనే చేసావులే. ఇది ఇండియా కాదు. అలా ఒక్కసారి నీకు హెల్ప్ చేసినందుకు రోజూ ఫోన్ చేసి చంపుతావా ఏంటి? ఎవరి పనులు వాళ్ళకి ఉంటాయి. అంత తీరిక, సమయం ఎవ్వరికీ ఉండదు. అయినా స్వీట్స్ పంపాలంటే వాళ్ళ అడ్రెస్ కావాలిగా?"

"వాళ్ళాయన బిజినెస్ కార్డ్ ఇచ్చింది."

ఇంకా పెద్దగా నవ్వి "వాళ్ళ హాస్పిటల్‌కి పంపి పేషెంట్స్‌కి పంచమంటావా ఏంటి?"

"అమ్మ చెప్పిందని పంపుదామనుకున్నా"

"లైట్ తీస్కో. అమ్మ అంతే అంటుంది. బ్రేక్ ఫాస్ట్ చేద్దామా?"

"ఏమైనా వండనా?"

"అక్కర్లేదు. ఓట్ మీల్ తిందాం. ఇక్కడ ఉన్నంతకాలం ఇలాంటివి అలవాటు చేసుకో. నువ్వు ఇండియానాకి వెళ్ళాక నీకు హెల్ప్ అవుతుంది. ఇడ్లీ, దోశలాంటివి రోజూ వండాలంటే కష్టం. నీ రోజులో సగం వంటకి, తోమడానికే సరిపోతుంది."

"కానీ రోజూ ఒకటే అయితే కష్టం కదా"

"ఒకరోజు ఓట్ మీల్ తిను, ఇంకోరోజు బ్రెడ్ అండ్ చీజ్, ఇంకోరోజు టోస్ట్. అయినా ఓట్ మీల్‌లోనే ఎన్నో రకాల ఫ్లేవర్స్ ఉంటాయి. మార్నింగ్ తక్కువ ఫేట్, ఎక్కువ ఫైబర్ తినేలా ప్లాన్ చేసుకో."

"సరే అయితే. అంతే చేస్తాను."

"ఇప్పుడు నేను చెప్తున్నవి నువ్వు అక్కడికి వెళ్ళేసరికి మర్చిపోతావు. కానీ ఏ అవసరమైనా నాకు ఫోన్ చెయ్యి. ఐం ఓన్లీ ఎ ఫోన్ కాల్ అవే.. ఫోన్ అంటే గుర్తొచ్చింది. నీ ఫ్రెండ్స్ ఎవరితో అయినా ఫోన్ మాట్లాడతావా?"

"అక్కర్లేదు. ఫేస్‌బుక్‌లో చాట్ చేసాను."

"తినేసాక ముందు బయట పన్లు పూర్తి చేద్దామా?"

"నేనింకా స్నానం చెయ్యలేదు."

"పర్లేదు. మనమేమీ పార్టీకి వెళ్ళట్లేదు" మొరటుగా బదులిచ్చాడు.

బ్రేక్‌ఫాస్ట్ పూర్తిచేసి బయలు దేరబోతుండగా "ఫస్ట్ ఫోన్ తీసుకుందాం. తరవాత నీ హెయిర్ కట్‌కి వెళ్దాం" అన్నాడు.

ఇన్నేళ్ళు కష్టపడి వారం వారం నూనె, కుంకుడికాయ పులుసు, వగైరా వగైరాలు పెట్టి పోషించి పెంచుకున్న జుట్టు కట్ చేయించాలా అని గింజుకుంటుండగా "లేప్ టాప్ కూడ్ కొనాలేవ్. నేను మర్చిపోతే నువ్వు గుర్తు చెయ్యి" అన్నాడు.

ఏటీ ఎండ్ టీ స్టోర్ చేరాక అన్నయ్య అక్కడ పనిచేసే వ్యక్తితో వివరాలు మాట్లాడుతుండగా నేను డిస్‌ప్లేలో ఉన్న గేడ్జెట్స్ చూస్తూ కాలక్షేపం చేసాను.

"విచ్ ఫోన్ డు యు వాంట్?" అన్నయ్య అడిగాడు.

"యువర్ విష్" బదులిచ్చాను.

"ఐ థింక్ యు విల్ లైక్ దిస్ పీస్" అంటూ అక్కడ పనిచేసే వ్యక్తి వివరించసాగాడు.

"హౌ మచ్?" అన్నయ్యని చూస్తూ అడిగాను.

"ఇట్ కమ్స్ టు సెవంటీ డాలర్స్ పర్ మంత్..." పనిచేసే వ్యక్తి బదులిచ్చాడు.

"విచ్ ఈజ్ చీపెస్ట్?" దీనంగా అడిగాను.

"ఐ ఫోన్ 4 ఎస్.యు నీడ్ టు పే ఓన్లీ వన్ డాలర్ ఫర్" అనగానే అన్నయ్య వంక చూసాను.

"అంత కక్కుర్తి ఎందుకే? నేను కడతాను కదా ఇన్‌స్టాల్ మెంట్స్‌ని?" అన్నయ్య అడిగాడు.

"అంత మంచి ఫోన్ అక్కర్లేదన్నయ్యా. బేసిక్ ఫోన్ సరిపోతుంది" జవాబిచ్చాను.

ఒకటికి పదిసార్లు అడిగిన తరువాతే అన్నయ్య ఆ ఫోన్ కొనిచ్చాడు.

బయటకి వచ్చాక "పక్కనే 'బెస్ట్ బై'లో లేప్‌టాప్ తీసుకుందాం పద" అన్నాడు.

బెస్ట్ బైలోకి వెళుతూ "ఎలాంటి లేప్ టాప్ కావాలి?" అడిగాడు.

"మేక్ బుక్" అమాయకంగా అన్నాను.

"నీకు జాబ్ వచ్చాక కొనుక్కో. స్టూడెంట్స్‌కి డెల్ లాంటిది బెస్ట్. టు ఇయర్స్ వాడాక పడేసి కొత్తది కొనుక్కోవచ్చు."

"సరే. నువ్వే సెలక్ట్ చెయ్యి. నాకు లేప్ టాప్స్ గురించి తెలియదు"

నేననుకున్నట్లు కాక పదినిమిషాల్లో కొనడం పూర్తయ్యింది.

కారెక్కి డ్రైవ్ చెయ్యడం మొదలు పెట్టాక "ఇంటికెళ్ళాక గుర్తుచెయ్యి. నీకు వైఫై పాస్‌వర్డ్ చెప్తాను. అలానే నీకు కొన్ని ఏప్స్ చెప్తా. నీ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకో" అన్నాడు.

తలూపి, అన్నయ్య హెయిర్ కట్ గురించి మర్చిపోయాడని ఆనందించిన ఒక్క నిమిషంలోనే "నేను వెళ్ళే సెలూన్‌కి తీసుకెళ్తానిన్ను. అక్కడ అపాయింట్ మెంట్ అవసరంలేదు. వాక్- ఇన్ ఏక్సెప్ట్ చేస్తారు" అన్నాడు.

"హెయిర్ కట్‌కి అపాయింట్ మెంటా?" ఆశ్చర్యపోయాను.

"ఔను. ఇక్కడ అన్నిటికీ అపాయింట్‌మెంట్ తీసుకోవాలి. కానీ ఇప్పుడు మనం వెళ్ళేచోట మేక్సిమమ్ పదిహేను నిమిషాలు వెయిట్ ఉంటుంది. అంతే" అంటూ కార్ పార్క్ చేశాడు.

వీసా ఇంటర్వ్యూకి వెళ్ళినప్పటిలాగా నా గుండె ఎంతో వేగంగా కొట్టుకుంది. ఇంత పెద్ద జుట్టు. మళ్ళీ ఇంత పొడుగు ఎప్పటికి పెరుగుతుందో? జుట్టులో కత్తెర పెడితే ఊడడం మొదలౌతుందని అమ్మమ్మ చెప్పింది. ప్రతి అడుగూ భారీగా వేసాను. అసలు పొట్టి జుట్టు నా మొహానికి సరిపోతుందో లేదో..

"నీకు షార్ట్ హెయిర్ బానే ఉంటుంది. దీనికి టెన్షన్ పడకు" నా ఆలోచన వినబడినట్టు అన్నయ్య అన్నాడు.

బార్బర్‌తో మాట్లాడాక తెలిసింది ఇక్కడ అబ్బాయిలకి హెయిర్ కట్ చేస్తారు. అమ్మాయిలకి కాదు అని. ఒక అమ్మాయి బార్బర్ ఉంది కానీ రకరకాల హెయిర్ కట్స్ చెయ్యడం రాదట.

"సింపుల్‌ది చాలన్నయ్యా" ఆ అమ్మాయికి వినబడకుండా చెప్పాను.

అన్నయ్య ఆవిడని హెయిర్ కట్స్ గురించి కాస్త ఎంక్వైరీ చేసాడు. ఏదో ఒక దాంతో సరిపెట్టుకోకుండా అన్నయ్య జాబ్ ఇంటర్వ్యూలా ఆవిడని ప్రశ్నలు అడగడం వింటూ నా గాబరా పెరిగింది. సెలూన్‌కి వచ్చిన ఫోన్ మాట్లాడేందుకు ఆ అమ్మాయి వెళ్ళింది. అన్నయ్య ఆమె వంక చూస్తూ "తన హెయిర్ స్టైల్ బావుంది" అన్నాడు.

"ఔను నాకూ వచ్చింది" అన్నాను.

ఆ అమ్మాయి తిరిగి వచ్చాక "షీ లైక్స్ యువర్ హెయిర్ స్టైల్. కెన్ యు కట్ లైక్ దట్?" అడిగాడు.

"యా. షూర్. షూర్. ఇట్ విల్ క్యూట్ ఆన్ యు" అని నావైపు చూసి తన వెంట రమ్మని సైగ చేసింది.

వెంటనే "అన్నయ్యా" తెలియకుండానే గట్టిగా పిలిచాను. అన్నయ్య గబుక్కున నావైపు చూడగానే "అంత పొట్టిగానా?" దిగులుగా అడిగాను.

"తెలుగు సీరియల్‌లో అత్తగారిలా పిలిచావేంటే? నీకు ఆ స్టైల్ బానే ఉంటుందిలే"

నేను ఒప్పుకోకపోవడం గమనించి "బావుండక పోతే ఏం కాదు. ఓ రెండు నెలల్లో మళ్ళీ పెరుగుతుంది. నువ్వేమీ ఆల్ జైమర్స్ పేషెంట్‌వి కాదు కదా" అని ఒప్పించాడు.

ఆవిడ నా జుట్టుని ఓ పది నిమిషాలపాటు పొగిడింది. అది విని అన్నయ్య మనసు మారుతుందేమో అని ఆశగా చూసాను. తన ముఖంలో ఏ మార్పూ లేదు.

"ఆర్ యు షూర్" అని పదిసార్లు అడుగుతూనే ఆవిడ నా జుట్టుకి రబ్బర్ బాండ్ పెట్టింది. కట్ చేసే ముందు మరోసారి కన్‌ఫర్మ్ చేసుకుంది.

జుట్టులో కత్తెర పెట్టాక 'నో' అని అరవబుద్దైంది.

లేచి పారిపోవాలనిపించింది. గట్టిగా కళ్ళుమూసుకుని అంకెలు లెక్కపెట్టడం మొదలు పెట్టాను. పదిహేను చేరేసరికి ఆవిడ చేతిలోకి నా పిలక వచ్చేసింది. నమ్మకం కుదరక తడిమి చూసాను. ఇదివరకటిలా కాక నా వీపు నాకు తగిలింది. ఆవిడ చేతిలో నా జుట్టు చూసి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆవిడ దాన్ని బాగ్‌లో పెడతానని లోపలికి వెళ్ళింది.

"ఏడవకు చిట్టిపాప. ఏడవకు" అన్నయ్య హేళన చేసాడు.

"నేనేమీ ఏడవట్లేదు. అయినా తను జుట్టుని డొనేట్ చేస్తుంటారు. అందుకనుకుంట"

"జుట్టు డొనేటా?" ఆశ్చర్యపోయాను.

"యా. కేన్సర్ పేషెంట్స్, బర్న్ విక్టిమ్స్ లాంటి చిన్నపిల్లలకి ప్రొస్తెటిక్స్ చేసి ఫ్రీగా ఇస్తారు"

"హెయిర్ ప్రొస్తెటిక్సా?" మళ్ళీ ఆశ్చర్యపోయాను.

"ఔను. పిల్లలు స్కూల్‌కి వెళ్ళినప్పుడు క్లాస్ మేట్స్ విగ్ లాగేసి ఏడిపిస్తారు. అందుకని హెయిర్ ప్రొస్తెటిక్‌ని ఫిట్ చేస్తారు. వాళ్ళు పెరిగే కొద్దీ మెషర్ మెంట్స్ తీసుకుని కొత్తవి తయారు చేస్తారు" వివరించాడు.

మంచి పనికి జుట్టుని వాడతారు కాబట్టి చింత కాస్త తగ్గింది.

ఆ అమ్మాయి తిరిగి వచ్చి నా జుట్టు కత్తిరించడం పూర్తిచేసేంత వరకు నేను కళ్ళు తెరవలేదు.

"బ్యూటిఫుల్" ఆ అమ్మాయి అన్న వెంటనే అన్నయ్య ముఖం చూసాను.

"వావ్.. యు లుక్ లైక్ ఎ బేబి" నా జుట్టు తడుముతూ అన్నాడు.

"యూ లుక్ గార్జియస్. హౌ డు యు లైక్ ఇట్?" ఆ అమ్మాయి నా జవాబుకోసం ఎదురు చూసింది. ధైర్యం చేసి అద్దంలోకి చూసాను. జుట్టు కట్ చేసిన దిగులంతా ఒక్క క్షణంలో మాయమయ్యింది. నా జుట్టు భుజాలని తాకీ తాకనంత పొడుగు. జుట్టు అంచుల్లో రింగులు తిరిగి ఉంది. ఎప్పుడూ స్ట్రైట్‌గా ఉండే నా జుట్టు రింగులు తిరుగుతుందన్న ఆలోచన కూడా ఎప్పుడూ రాలేదు. ఆనందంతో వచ్చిన నవ్వు ఎంత ప్రయత్నించినా ఆగలేదు.

"ఐ లవ్ ఇట్" నేను బదులివ్వడంతో అన్నయ్య ఊపిరి పీల్చాడు. ఆ తరువాత ఆ అమ్మాయితో జుట్టు డొనేట్ చేసే ప్రాసెస్‌ని కనుక్కుని డబ్బు చెల్లించేంతసేపూ నేను అద్దంలో జుట్టుని ఆరాధిస్తూనే ఉండిపోయాను.

బయటికి నడవగానే "అక్కడ నుంచో. నీ జుట్టికి ఓ ఫోటో తీస్తా" అన్నాడు.

ఆ ఫోటోని చూపించి "అమ్మకి పంపుదాం" అన్నాడు.

"తిడుతుందేమో" భయంగా అన్నాను.

"నువ్వు కూడా కట్ చేసే ముందు వద్దు అనే అన్నావు. ఇప్పుడు తల్లోంచి చెయ్యి దింపట్లేదు. అమ్మ కూడా అలానే. అయి నా నేను మాట్లాడతా కదా" ధైర్యం చెప్పాడు.

ఇంటికెళ్ళే దారంతా జుట్టుని ముట్టుకుంటూ, ఇంటికెళ్ళినప్పటినుండి అద్దంలో చూసుకుంటూ లంచ్ టైం వరకు గడిపేసాను.

"మిస్ ఇండియా, తిందామా?" అడిగాడు అన్నయ్య.

"మిస్ ఇండియా ఏంటి కొత్తగా?"

"మిస్ ఇండియానే నీలా అద్దంకి అతుక్కుపోయి ఉంటుంది."

"నేనేం అద్దంకి అతుక్కుపోలేదు."

"సర్లే తిందాం రా"

"ఆకలేయటంలేదు."

"ఆనందంతో కడుపునిండిపోయినట్లుంది అమ్మగారికి."

ఎంత ప్రయత్నించినా కోపం రాలేదు.

"సర్లే, కాసేపాగి తిను నువ్వు. నాకు ఆకలి దంచేస్తుంది" అన్నయ్య అన్నాడు.

తిరిగి జుట్టుని దువ్వుతూ ఆనందంలో మునిగిపోయాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story